నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఉప్పల్‌: 33/11 కేవీ ఎన్‌జీఆర్‌ఐ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ పెద్ద చెరువు ఫీడర్ పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11.30 నుంచి 12.30 వరకు హెచ్‌ఎం టీనగర్, సరస్వతినగర్, బాపూజీనగర్, సాయి దుర్గా కాంప్లెక్స్, హైకోర్టు కాలనీ, సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఉప్పల్ విద్యుత్ ఏఈ నిఖిల్ తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు



బోడుప్పల్‌: కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల పక్షపాతి అని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. 17వ డివిజన్ మణికంఠనగర్ కాలనీకి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నేతలు ఆదివారం వజ్రేష్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలపై ప్రజలు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇస్తామన్నారు. మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి విశ్వంగుప్తా, శ్రీనివాస్‌గౌడ్, సుధాకర్ తదితరులున్నారు.

100 డప్పులతో ర్యాలీ !



మల్లాపూర్‌: ఫిబ్రవరి 7న జరగబోయే 'వేయి గొంతులు.. లక్ష డప్పులు' కార్యక్రమానికి మద్దతుగా ఆదివారం నాచారం మాదిగ సంఘం ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగకు మద్దతుగా 100 డప్పులతో ర్యాలీ నిర్వహించారు. నాచారం మాదిగ సంఘం సభ్యులు తదితరులున్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు



మేడిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకు అవగాహన సభలను ఏర్పాటు చేయనున్నట్లు పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు అన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు సందర్భంగా వార్డు సభల్లో అవగాహన కల్పించనున్నట్లు కమిషనర్ స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలో అన్ని వార్డుల్లో రేపటి నుంచి 23 వరకు వార్డు సభలను ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా వార్డు సభల్లో ప్రజలు పాల్గొని లబ్ధిదారుల వివరాలు, సందేహాలు నివృత్తి చేసుకోవచ్చన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం




మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 25వ డివిజన్ కమ్యూనిటీహాల్‌లో ఆదివారం అభినవ్ ఐ కేర్ అండ్ లేజర్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మాజీ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డిలు ప్రారంభించారు.

'ఆర్‌ఆర్‌ఆర్' అవగాహన ర్యాలీ

మౌలాలి : మౌలాలి డివిజన్ రాక్‌హిల్స్ కాలనీలో 'ఆర్‌ఆర్‌ఆర్' (రెడ్యూస్, రీయూస్, రీసైక్లింగ్) అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ అధికారులు, సహాయ వైద్యాధికారి మంజుల పాల్గొని రాక్‌హిల్ కాలనీ వాసులకు ఆర్‌ఆర్‌ఆర్ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. భవిష్యత్‌తరాలకు ప్రకృతి వనరులను అందించిన వారమవుతామని పేర్కొన్నారు. శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, భారతి, రవి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాపసింగారంలో సీసీ కెమెరాలను మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. తన సొంత నిధులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశానన్నారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, చైర్మన్ కొండల్‌రెడ్డి, మేడిపల్లి సీఐ గోవిందరెడ్డి, నాయకులు కందుల కుమార్, బద్దం కుమార్, ప్రభాకర్ తదితరులున్నారు.

అక్రమ పార్కింగ్‌లపై చర్యలేవి ?



ఆర్టీసీ కాలనీలో వాహనాల పార్కింగ్

- రోడ్లకు ఇరువైపులా పార్కింగ్
- కుంచించుకుపోతున్న రహదారులు
- ఇబ్బంది పడుతున్న వాహనదారులు
- బస్సులు నడపలేమంటున్న ఆర్టీసీ



చిన్న చెరువు రోడ్డుపై..

రామంతాపూర్ : రామంతాపూర్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీలోని అంతర్గత రోడ్లకు ఇరువైపులా ఇష్టానుసారంగా వాహనాలను పార్క్ చేస్తూ.. ఉండటంతో అంతర్గత రోడ్లు మరింత కుంచించుకుపోయి ప్రధాన రహదారికి చేరుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు చెబుతున్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం..

రామంతాపూర్ పరిధిలోని నెహ్రూనగర్ మార్కెట్ రోడ్డు ఏడీఆర్‌ఎం ఆసుపత్రి శారదానగర్ రోడ్డు, శివాలయం ముఖద్వారం, శారదానగర్ రోడ్డు, శ్రీనగర్‌కాలనీ, భరత్‌నగర్, వెంకట్‌రెడ్డినగర్, రామ్‌రెడ్డినగర్, కామాక్షిపురం, శ్రీనివాసపురం, నాగోల్‌కు వెళ్లే బైపాస్ రోడ్డుతో పాటు ఆర్టీసీ కాలనీ నగర్ తదితర కాలనీలు, బస్తీలకు చెందిన వారు ప్రధాన రహదారులకు చేరుకోవడానికి వెళ్లే మార్గంలో అంతర్గత రహదారులపై ఇరువైపులా కొంత మంది తమ వాహనాలను అక్రమ పార్కింగ్ చేస్తుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

◆ ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూళ్లు, కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శివాలయం ముఖద్వారం, శారదానగర్ రోడ్డులో ఉన్న గోడౌన్‌లకు వచ్చే వాహనాలు ఈ రోడ్డుపై గంటల తరబడి ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది.

ఆర్టీసీ బస్సులు బంద్..

రామంతాపూర్ ఆర్టీసీకాలనీ, మీ సేవా కేంద్రం ఎదురుగా ఉన్న విశాలమైన రోడ్డులో స్థానికులు కాకుండా కొంతమంది రోడ్డుపై అక్రమ పార్కింగ్ చేసి వారాల తరబడి ఇక్కడే వదిలేసి తర్వాత తీసుకెళ్తున్నారు. దీంతో ప్రతిరోజు ఆర్టీసీ కాలనీ నుంచి సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు 18 ఆర్ ఆర్టీసీ బస్సు ఉదయం నుంచి సాయంత్రం వరకు నడిచేవి. అయితే బస్సు నిలిపేందుకు స్థలం లేకపోవడంతో సర్వీసులను పూర్తిగా రద్దు చేశారు.

◆ ఇటీవల స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు రామంతాపూర్ ఆర్టీసీకాలనీ ఓల్డ్ రామంతాపూర్‌కు వచ్చే ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని డిపో మేనేజర్‌ను కోరినా.. అక్రమ పార్కింగ్ తొలగించిన తర్వాతే బస్సులను పునరుద్ధరిస్తామని చెప్పినట్లు సమాచారం.

ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలి..



రామంతాపూర్‌లోని పలు అంతర్గత రోడ్లలో అక్రమపార్కింగ్‌లతో అత్యవసర పనుల కోసం వెళ్లే వారు నిర్ణీత సమయానికి చేరుకోలేక ఇబ్బంది పడుతున్నారు. కనీసం వారంలో రెండు, మూడు రోజులైనా ఉప్పల్ ట్రాఫిక్ పోలీసులు అంతర్గత రోడ్లలోని అక్రమ పార్కింగ్‌లపై దృష్టి సారించాలి.

– సతీష్, ఆర్టీసీ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధి

రైల్వే అండర్ బ్రిడ్జి పనులు పూర్తి చేయించండి



ఎంపీకి వినతిపత్రం ఇస్తున్న మల్కాజిగిరి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు

కుషాయిగూడ: నేరేడ్‌మెట్, వాజ్‌పేయినగర్ రైల్వే క్రాసింగ్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదివారం మల్కాజిగిరి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతేడాది క్రితమే రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరైనా.. పనులు ప్రారంభించలేదని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. డైట్ కాలేజీ ఆవరణలో నిర్మిస్తున్న మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కోర్టు పనులు మరో ఏడాది లోగా పూర్తయ్యే అవకాశం ఉందని ఎంపీకి వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన రైల్వే అధికారులతో మాట్లాడి పనులు పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మల్కాజిగిరి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మోహన్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రవికుమార్, మీనా, సంతోష్‌కుమార్, సుజాత, అనిల్‌కుమార్, పవన్ రాఘవ్, డేవిడ్, సరిత, రవికృష్ణ తదితరులున్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి

రామంతాపూర్ : అర్హులకు రేషన్‌కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ అని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఓల్డ్ రామంతాపూర్ ఇందిరానగర్ తదితర కాలనీలో జరుగుతున్న రేషన్‌కార్డుల అర్హుల ఎంపిక సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు పకడ్బందీగా అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామన్నారు. ఈనెల 21 నుంచి 24 వరకు జరిగే వార్డు సమావేశంలో కొత్తవారు సైతం దరఖాస్తు చేసుకోవచ్చని ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారికి త్వరలో కొత్త రేషన్‌కార్డులు అందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సీనియర్ కాంగ్రెస్ నేతలు మహ్మద్ రఫీక్, మురళీగౌడ్, రఫీక్, శ్రీకాంత్‌యాదవ్, సుధాకర్, ఉపేందర్‌రెడ్డి, పూస సత్తయ్య, సత్యనారాయణ, సురేష్, జలీల్‌బాబు, నామ్ రాజిరెడ్డి తదితరులున్నారు.

రేషన్‌కార్డు దరఖాస్తుల పరిశీలన

అల్వాల్: రేషన్‌కార్డు దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని త్వరలోనే వార్డు సభలు నిర్వహించి అర్హుల జాబితాలో విభజిస్తామని, రూపొందించి ప్రభుత్వానికి పంపుతామని అల్వాల్ సర్కిల్ ఉప కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అల్వాల్ సర్కిల్ పరిధిలోని వెంకటాపురం, మచ్చబొల్లారం, అల్వాల్ డివిజన్లలో ప్రజాపాలనలో వచ్చిన 1047 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి పరిశీలించిన జాబితాను రూపొందించామన్నారు. మచ్చబొల్లారం డివిజన్‌లో 354, అల్వాల్ డివిజన్‌లో 449, వెంకటాపురం డివిజన్‌లో 244 దరఖాస్తులు వచ్చాయని వివరించారు.





అల్వాల్‌లో దరఖాస్తులను పరిశీలిస్తున్న సర్కిల్ అధికారులు

రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులు



పనులను ప్రారంభిస్తున్న మేయర్ అమర్‌సింగ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 20,24,26 డివిజన్లలో స్థానిక మేయర్ అమర్‌సింగ్, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, శరత్‌చంద్రారెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్‌లతో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మేయర్ అమర్‌సింగ్ మాట్లాడుతూ.. పట్టణాభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. డీఈ సాయినాథ్‌గౌడ్, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, వివిధ కాలనీల ప్రతినిధులు ఉన్నారు.

నేటి నుంచి బధిరుల అంతర్జాతీయ సదస్సు



పఠాన్ ఉమర్‌ఖాన్

అల్వాల్: నెరేడ్‌మెట్‌కు చెందిన హెలెన్ కెల్లర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిసెబుల్డ్ చిల్డ్రన్ పరిశోధన, పునరావాసం సహకారంతో ఇరురాష్ట్రాలతో పాటు అంతర్జాతీయ బదిర విద్యార్థులు బదిరుల విద్యా విధానాలపై చర్చించేందుకు నేటి నుంచి 22 వరకు రెడ్‌హిల్స్‌లోని కేఎల్‌ఎన్. ప్రసాద్ ఆడిటోరియంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పఠాన్ ఉమర్‌ఖాన్ ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ముఖ్య అతిథిగా హాజరై సదస్సును ప్రారంభిస్తారన్నారు. ముంబైకి చెందిన బదిరుల జాతీయ ఉన్నత కళాశాల అలీ ఆవర్జంగ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్ డాక్టర్ సుమన్‌కుమార్ హాజరై దేశంలో బదిరుల కోసం ప్రభుత్వం అందించే ఉపాధి సదుపాయాల గురించి వివరిస్తారన్నారు.

నేడు డీపీఎస్‌లో ట్రాఫిక్‌పై అవగాహన

మల్లాపూర్: నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు 'ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీపీఎస్ యాజమన్యం ప్రకటించింది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హాజరై ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు వివరించనున్నట్లు సమాచారం.

స్థానిక సమస్యలు పరిష్కరిస్తా



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం భవానీనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సమస్యలను తన వంతుగా పరిష్కరిస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం భవానీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కేలండర్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. బీఆర్‌ఎస్ నేత సాయిజెనోఖర్, కాలనీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కంచర్ల మధుసూదన్‌రెడ్డి, కాలనీ వాసులు కృష్ణారెడ్డి, వినోద, హరినాథ్‌రెడ్డి, భవానీ, అశోక్, భాస్కరాచార్యులు, రాయుడు, విష్ణువర్ధన్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రమేష్‌చారి, శ్రీధర్‌రెడ్డి, నవీన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యోగి వేమనకు నివాళి

కుషాయిగూడ: తెలుగు అభ్యుదయ, విశ్వకవి యోగి వేమన జయంతి వేడుకలను ఆదివారం కుషాయిగూడ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు నాగిళ్ల బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాఘవరెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకట నరసింహారెడ్డి, సురేష్‌రెడ్డి, బొల్లంపల్లి రామచంద్రారెడ్డి, వెంకట్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, సత్తిరెడ్డి, హన్మంతరెడ్డి తదితరులున్నారు.



నివాళులర్పించిన కుషాయిగూడ రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

కాలనీల అభివృద్ధికి కృషి



ప్రారంభోత్సవంలో మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: కాలనీల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. ఎస్‌వైనగర్‌లో రూ.19 లక్షలతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. శ్రీమహాలక్ష్మినగర్ కాలనీ అసోసియేషన్ కార్యాలయాన్ని ఆదివారం డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీల్లో తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యం, విద్యుత్‌కు ప్రాధాన్యతనిస్తున్నట్లు వివరించారు. కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రావు, మైనార్టీ అధ్యక్షుడు షేక్ అక్బర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం బడుగులకు ఆదర్శం



ఘట్‌కేసర్: అంబేడ్కర్ బడుగుల కోసం జీవితం అర్పించారని తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దళితులు ఆర్థిక, రాజకీయ, సామాజికంగా ఎదిగినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లన్నారు. కార్పొరేట్ స్కూల్, కాలేజీలు, కాలనీల్లో బతికే దిశగా మనం అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. దాసు, మీసాల మల్లేష్, కౌన్సిలర్లు మల్లేష్, జహంగీర్, నాయకులు నర్సింగ్‌రావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పోచారం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిన ఘటన పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అన్నోజిగూడలోని రాజీవ్ గృహకల్ప కాలనీకి చెందిన భార్యాభర్తలు బత్తిన రేణుక, ఈశ్వర్ శనివారం సాయంత్రం నారపల్లిలోని ఎంజీఆర్‌మాల్‌లో సినిమా చూసేందుకు బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో అన్నోజిగూడ ఫ్లై ఓవర్ వద్దకు రాగానే వెనుక నుంచి గుర్తు తెలియని కారు వేగంగా వచ్చి వారి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో రేణుక స్వల్పంగా గాయపడగా.. ఈశ్వర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నారపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఈశ్వర్‌ను గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ అతడు ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల ఆకస్మిక తనిఖీలు

6 కిలోల గంజాయి స్వాధీనం



పోచారం/కుషాయిగూడ: చర్లపల్లి–రాంపల్లి రోడ్డులో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పోలీసుల ఆకస్మిక తనిఖీల్లో సుమారు 6 కిలోల గంజాయి బయట పడగా ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వివరాల ప్రకారం.. హరికృష్ణ అనే వ్యక్తి వద్ద 4 కిలోలు, ఒడిశా ప్రాంతానికి చెందిన వైద్యనాథ్ బిశ్వాల్ వద్ద 2 కిలోలు గంజాయి లభ్యమైందని, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ భరత్ భూషణ్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామన్నారు.

కాలనీవాసులకు అండగా ఉంటా: సుదర్శన్‌రెడ్డి

పోచారం: ఏకశిలానగర్ వెంచర్ వాసులకు అండగా ఉంటానని మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆఖరి ప్లాటు యజమాని ఇళ్లు కట్టుకునే వరకు తోడుగా ఉంటానన్నారు. ఆదివారం నారపల్లిలోని ఏకశిలానగర్ వెంచర్‌లో ప్లాట్ల యజమానులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ఏకశిలానగర్ వెంచర్ ఏర్పాటుపై తెరపైకి వచ్చిన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బాధితులకు న్యాయం జరిగేంత వరకు ఆందోళనను ఉధృతం చేయాలని సూచించారు. అసోసియేషన్ ప్రతినిధులు శివారెడ్డి, న్యాయవాది జుబేర్ పాల్గొన్నారు.

ప్రముఖ విద్యా సంస్థల చెంతనే దుర్వాసన !

చెత్త డంపింగ్, మూత్రశాలలుగా ఫుట్‌పాత్‌లు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ కార్యాలయానికి కూత వేటు దూరంలోనే ప్రముఖ విద్యాసంస్థల వద్ద ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై మూత్ర విసర్జన చేయడంతో దుర్వాసనతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉప్పల్ వరంగల్ జాతీయ రహదారి నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో బిజీగా ఉంటుంది. దీనికి ప్రత్యామ్నాయ మార్గంగా ఉప్పల్ సర్వే ఆఫ్ ఇండియా పార్కు నుంచి లిటిల్ ఫ్లవర్ కళాశాల వెనకాల రోడ్డు తిరిగి వరంగల్ రోడ్డుకు అనుసంధానం అవుతుంది. ఈ రహదారిలో ట్రాఫిక్ కూడా అదే స్థాయిలో నిత్యం బిజీగా ఉంటుంది.

ఫుట్‌పాత్ ఆక్రమణలు..

ఓ వైపు ఫుట్‌పాత్‌ను పూర్తిగా ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తుండగా మరో పక్క రెండు అతిపెద్ద స్కూల్స్ కేంద్రీయ విద్యాలయం -2, ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ విద్యా సంస్థలకు ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్ పూర్తిగా మూత్రశాల, చెత్త డంపింగ్‌గా మారడంతో పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక అవస్థలు పడుతున్నారు.

విద్యాలయానికి ఆనుకునే చెట్ల పొదలు..

కేంద్రీయ విద్యాలయ ప్రహరీని ఆనుకుని ఉన్న చెట్ల పొదలు ఫుట్‌పాత్‌ను పూర్తిగా ఆక్రమించడంతో మూత్ర విసర్జనకు అనువుగా మారింది. దీంతో పాటు స్థానికంగా ఉండే వ్యాపార సంస్థలు, టిఫిన్ సెంటర్లు, చేపల మార్కెట్, చికెన్ వ్యర్థాలను సైతం ఫుట్‌పాత్‌పైనే పారవేయడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. తప్పని పరిస్థితుల్లో ఇటువైపు నుంచి వెళ్లాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కేంద్రీయ విద్యాలయం ప్రహరీపై ఇలా..

జీహెచ్‌ఎంసీ దృష్టి సారించాలి..

వేలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తున్న దృష్ట్యా జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకుని ఫుట్‌పాత్‌పై వ్యర్థాలను తొలగించి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను కోరుతున్నారు.

బహిరంగ మూత్ర విసర్జన చేస్తే కఠిన చర్యలు

బహిరంగ మూత్ర విసర్జనపై కఠిన చర్యలు తీసుకుంటాం. ఫుట్‌పాత్‌పైకి వచ్చిన చెట్లను తొలగించేందుకు కేవీ స్కూల్ యాజమాన్యానికి లేఖ రాశాం. ఫుట్‌పాత్‌పై చెత్త వేసే టిఫిన్ సెంటర్లకు, ఫిష్ స్టాల్, చికెన్ సెంటర్ నిర్వాహకులకు నోటీసులు అందజేసి వ్యర్థాలు పారవేయకుండా చర్యలు తీసుకుంటాం.

– ఆంజనేయులు, ఉప్పల్ సర్కిల్ డీసీ

అధికారులకు ఫిర్యాదు చేశాం

ఫుట్‌పాత్‌లపై చెత్తా,చెదారం, మూత్ర విసర్జన తదితర అంశాలు మా దృష్టికి వచ్చాయి. జీహెచ్‌ఎంసీ అధికారులుకు ఫిర్యాదు చేశాం. కేంద్రీయ విద్యాలయ-2 ప్రహరీ పెంపునకు సర్వే ఆఫ్ ఇండియా అధికారులు వినతులను ఇచ్చాం. త్వరలో అనుమతి రాగానే ప్రహరీ నిర్మించి ఫుట్‌పాత్‌పైకి వచ్చిన చెట్లను తొలగిస్తాం.

– రాజేశ్వరి, కేంద్రీయ విద్యాలయ-2 ప్రిన్సిపాల్